

**జాతీయ రహదారి..యమపురి**
పశ్చిమ ప్రకాశంలో పలు రహదారులు, మూలమలుపులు ప్రయాణికుల ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.
- 8లో..



**బెంగళూరులో కేసు నమోదైందని..**
సీజీఐ పోలీసు అధికారులుగా నటిస్తూ డబ్బులు డిమాండ్ చేశారని ఎస్పీకి బాధితులు ఫిర్యాదు చేశారు.
- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
32/22

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి

● ముస్లిం ప్రజా సంఘాల నిరసన



నిరసన తెలుపుతున్న ముస్లిం ప్రజా సంఘాల నాయకులు

**ఒంగోలు వన్‌టౌన్:** వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ముస్లిం ప్రజా సంఘాలు సోమవారం నిరసన వ్యక్తం చేశాయి. ఒంగోలు పాత కూరగాయల మార్కెట్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం అజాద్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ చట్టం సవరణపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నా చట్టాన్ని ఆమోదించుకోవాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న ఏపీ ప్రభుత్వం చట్టాన్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ముస్లింలకు పెద్దన్నగా ఉంటానని ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. చంద్రబాబు ముస్లింల మనోభావాలను గౌరవించి వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు టీడీపీ ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనకుండా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లిం సమాజానికి అండగా నిలబడాలన్నారు. నిరసన కార్యక్రమంలో ముస్లిం సంఘాల ఐక్యవేదిక, ఆవాజ్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి సమితి, ముస్లిం సంక్షేమ సంఘం తదితర సంఘాల నాయకులు పఠాన్ కరిముల్లా ఖాన్, సయ్యద్ ఇస్మాయిల్, ఎస్‌కే మహ్మద్ రఫీ, సయ్యద్ హుస్సేన్, కరీముల్లా, ఎస్‌కె అమీర్, మహ్మద్ ఆషిక్, పఠాన్ మసూద్ ఖాన్, పఠాన్ రహమాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### ఏకేయూలో ఎంపీఈడీ పుస్తకావిష్కరణ




ఏకేయూలో పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

**ఒంగోలు సిటీ:** ఆంధ్రకేసరి యూనివర్సిటీతో పాటు ఇతర యూనివర్సిటీలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో మాస్టర్స్ డిగ్రీ (ఎం.పి.ఎడ్) చేస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టరు ఐ.దేవీ వరప్రసాద్ రచించిన 'అడ్వాన్సింగ్ ఫిజియాలజీ అప్లైడ్ స్టాటిస్టిక్స్ అండ్ లైఫ్ స్టైల్ మేనేజ్‌మెంట్' పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పుస్తకం విద్యార్థులకు కోర్సు పరంగానే కాకుండా ఇతరత్రా ఉద్యోగ అవకాశాలకు సంబంధించి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పాఠ్యాంశాలను సులభశైలిలో అర్థం చేసుకొని విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు తయారు కావడానికి ఉపకరిస్తుందన్నారు. పుస్తక రచయిత దేవీవరప్రసాద్ వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చతికిల బడి..
# ప్రైవేటుకు రా బడి

ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల పేరిట అడ్డగోలు దోపిడీకి తెరలేపాయి. ఫీజులను భారీగా పెంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై భారం మోపనున్నాయి. ప్లేస్కూల్, ఎల్‌కేజీ, యూకేజీ, మొదటి తరగతి నుంచి పదో తరగతి వరకు.. డొనేషన్లు, డెవలప్‌మెంట్ ఛార్జీలు, పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్టుల పేరిట తల్లిదండ్రుల జేబులకు భారీగా చిల్లులు పెడుతున్నాయి. డిమాండ్‌ను బట్టి ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నాయి. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రస్తుతం ఉన్న ఫీజులకు అదనంగా 25 శాతం నుంచి 40 వరకూ పెంచేందుకు ప్రైవేటు యాజమాన్యాలు సిద్ధమవుతున్నాయి.

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫీజులు పెంచేందుకు కార్పొరేట్ స్కూళ్ల సన్నద్ధం
- ప్రస్తుతం ఎల్‌కేజీకే ఫీజు రూ.30 వేలు వసూలు
- అదనంగా బుక్స్‌కి మరో రూ.6 వేలు వసూలు చేస్తున్న వైనం
- వచ్చే ఏడాది నుంచి ఫీజులో 15 శాతం నుంచి 40 శాతం పెంచేలా యాజమాన్యాలు
- ప్రభుత్వ విద్య అంటే పట్టని చంద్రబాబు
- జిల్లాలో 545 ప్రైవేట్ పాఠశాలలు..




**ఒంగోలు సిటీ:**

ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీకి అంతే లేకుండా పోతోంది. యాజమాన్యాలు వ్యాపార ధోరణితో వ్యవహరిస్తుండడంతో సామాన్యుడికి ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోంది. జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు 551 ఉన్నాయి. వీటిల్లో 1,27,768 మంది విద్యార్థులు చదువుతున్నారు. 176 ప్రైమరీ స్కూళ్లలో 38,305 మంది విద్యార్థులు, 132 యూపీ స్కూల్స్‌లో 19,900 మంది, 237 హైస్కూల్స్‌లో 66,240 మంది, సీబీఎస్‌ఈ సిలబస్‌తో 4 హైస్కూల్స్‌లో 2,121 మంది, ఐసీఎస్‌ఈ సిలబస్ తో 2 హైస్కూల్స్‌లో 1,202 మంది విద్యార్థులు చదువుతున్నారు.

**ఫీజుల భారం..**

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో తమ పిల్లల్ని చదివించాలంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ స్కూళ్లకు ముకుతాడు వేశారు. ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచకుండా చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థ గాడితప్పింది. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచేశాయి. ఒంగోలు నగరంలోని కార్పొరేట్ స్కూలులో ఎల్‌కేజీకి రూ.25 వేల నుంచి రూ.30 వేలు వసూలు చేస్తున్నారు. హైస్కూలు అయితే 6వ తరగతి వరకూ రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకూ ఉన్నాయి. కొన్ని పెద్ద విద్యా సంస్థలైతే రూ.లక్షన్నర వరకూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

**ప్రాంతాల వారీగా ఫీజులు**

నగరంతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రైవేటు యాజమాన్యాలు ఫీజుల మోత మోగిస్తున్నాయి. మార్కాపురం, దర్శి, చీమకుర్తి, కనిగిరి, పొదిలి పట్టణాల్లో స్కూళ్లలో ఫీజులు ఒంగోలు నగరంలో మాదిరిగా ఉన్నాయి. మిగతా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఫీజుల వ్యత్యాసం స్వల్పం. ఇక పుస్తకాల పేరుతో అదనంగా రూ.6,500 నుంచి రూ.10 వేల వరకూ వసూలు చేస్తున్నాయి.

**ట్యాబ్‌ల పంపిణీ..**

డిజిటల్ విద్యలో భాగంగా విద్యార్థులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. బైజూస్, టోఫెల్ కంటెంట్‌తో 8 నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులకు ట్యాబులు అందజేసింది. జిల్లా వ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న 21,617 మంది విద్యార్థుల్లో 20,436 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

### వైఎస్ జగన్ హయాంలో సర్కార్ స్కూళ్లకు వైభవం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సర్కార్ స్కూళ్లకు మహర్దశ పట్టింది. నాడు-నేడు పథకం ద్వారా స్కూళ్ల రూపురేఖలు మార్చేశారు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించారు. అలాగే ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌సీ సిలబస్‌ను అమలు చేశారు. సరిగ్గా స్కూలు తెరిచే సమయానికి ముందు ''జగనన్న విద్యా కానుక'' కింద పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, షూస్, బెల్ట్, టైలు, ఇంగ్లిష్ డిక్షనరీలు అందజేశారు. అలాగే అమ్మఒడి పథకం కింద తల్లుల ఖాతాలో రూ.15 వేలు జమ చేశారు. అలాగే డిజిటల్ విద్యను సైతం అందుబాటులోకి తెచ్చారు. ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, ప్రాథమిక పాఠశాలలకు స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు.

### ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసిన కూటమి

కూటమి ప్రభుత్వం సర్కార్ స్కూళ్లను పట్టించుకోవడం మానేసింది. నాడు-నేడు పనులను నిలిపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తి కావస్తున్నా ఒక్క తరగతి గది కూడా నిర్మించలేదు. ఫలితంగా పలు స్కూళ్లలో సరిపడా గదుల్లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌లు పనిచేయడంలేదు. సరైన మౌలిక వసతుల్లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఎన్నికల ముందు తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అందరికీ నీకు..రూ.15,000, నీకు రూ.15,000, నీకు రూ.15,000 అంటూ ప్రచారం చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఆ హామీని గాలికొదిలేశారు. ప్రభుత్వం కుంటిసాకులు చెబుతూ వాయిదాలు వేస్తూ వస్తోంది. వైఎస్సార్ హయాంలో నాలుగు విడతలు అమ్మఒడి కింద రూ.1357,83,15,000 తల్లుల ఖాతాలో జమచేసింది. అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేక కూటమి ప్రభుత్వం చతికిలపడింది.

**జిల్లా వ్యాప్తంగా అమ్మఒడి వివరాలు ఇలా..**

| సంవత్సరం | విద్యార్థుల తల్లుల సంఖ్య | విడుదలైన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2019-20 | 2,16,028 | 324,04,20,000 |
| 2020-21 | 1,97,329 | 295,99,35,000 |
| 2021-22 | 2,09,776 | 314,66,40,000 |
| 2022-23 | 2,82,088 | 423,13,20,000 |

**ఫీజు నియంత్రణ చట్టం ఏది?**



ఫీజు నియంత్రణ చట్ట ప్రకారం నిర్ణయించిన ఫీజులను నోటీసు బోర్డులో బహిరంగంగా ప్రకటించాలి. దీనిని కార్పొరేట్ విద్యాసంస్థలు పాటించడం లేదు. పుస్తకాలు, దుస్తులు సైతం స్కూల్‌లోనే కొనాలని నిబంధన పెట్టి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. టెక్నో, ఈ టెక్నో, ఒలింపియాడ్ వంటి పేర్లను ఉపయోగించకూడదు. అయినా కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా వాడుతున్నారు.

– సీహెచ్ వినోద్, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ

# అర్జీలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

**ఒంగోలు సిటీ:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 243 అర్జీలు వచ్చాయి. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరమే పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్క అర్జీ పై ప్రత్యేక శ్రద్ధపెట్టి వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలన్నారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్థసారథి, వరకుమార్, విజయజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనులను కాంట్రాక్టర్ లకు ఇవ్వకూడదన్న హైకోర్టు ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని జేసీకి వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు నన్నెబోయిన రవికుమార్ యాదవ్, బేస్తవారిపేట జెడ్పీటీసీ బండ్లమూడి వెంకటరాజు, రావిపాటి రమేష్‌రెడ్డి, మైనారిటీ నాయకులు నాసర్‌వలి, కాశీ విశ్వనాథ్, బోయపాటి రామకృష్ణ, ఏడుకొండలు వినతిపత్రం అందించారు.



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

**నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి**

**ఒంగోలు టౌన్:** రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినంలో ఐద్వా ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ల అనుకూల విధానాల ఫలితంగానే దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, నిరుపేద మధ్యతరగతి ప్రజల జీవితాలపై పెనుభారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే దాని ప్రభావం కుటుంబంలో మహిళపైనే పడుతుందన్నారు. ఆదాయాలు, నిత్యావసర వస్తువుల ధరలకు పొంతన లేకుండా పోవడంతో ప్రజలు అర్ధాకలితో అలమటించే రోజులు దాపురించాయని చెప్పారు. దీంతో సరైన పోషకాహారం లేక మహిళలు, చిన్నారుల ఆరోగ్యం దెబ్బ తింటుందని, రక్తహీనత, గర్భకోశ వ్యాధులు, కాల్షియంతో ఎదుగుదల లోపాలతో అల్లాడిపోతున్నారన్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని, కార్పొరేట్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు బి.గోవిందమ్మ, నాయకురాళ్లు రాజేశ్వరి, పెద గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జీబీఎస్ అంటువ్యాధి కాదు

● డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు

**కొమరోలు:** జీబీఎస్ అంటు వ్యాధి కాదని, ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని అలసందలపల్లె గ్రామంలో జీబీఎస్ వైరస్‌తో కమలమ్మ ఆదివారం మృతువాత పడిన విషయం తెలిసిందే. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి టి.వెంకటేశ్వర్లు సోమవారం అలసందలపల్లె గ్రామాన్ని సందర్శించారు. కమలమ్మ ఇంటికి వెళ్లి కమలమ్మ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీబీఎస్ వైరస్ ఒకరి నుంచి ఒకరికి సోకదని, ఒక కుటుంబం నుంచి మరో కుటుంబానికి వ్యాపించదని తెలిపారు. కండరాల బలహీనత, జ్వరం, కాళ్లనొప్పులు, విరేచనాలు వంటివి ఉంటే సమీప ప్రాంతంలోని ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని, ఎక్కువ రోజులు ఆ వ్యాధులతో బాధపడుతూ ఉండవద్దని ప్రజలకు సూచించారు. దీర్ఘకాలికమైన వ్యాధులు ఉన్న వారికి తప్పించి జీబీఎస్ వైరస్ సోకితే నూటికి నూరు శాతం రికవరీ అవుతారని తెలిపారు. ప్రజల్లో ఉన్న భయాన్ని విడనాడేలా వైద్య ఆరోగ్యశాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. లక్ష మందిలో ఒకరికి మాత్రమే ఈ వైరస్ సోకుతుందన్నారు. రాజుపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రజియత్‌భాను సోమవారం కూడా గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.పద్మావతి, ఎంపీడీవో మస్తాన్‌వలి, మండల విస్తరణాధికారి బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



కమలమ్మ మృతదేహాన్ని సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

# వరిగడ్డికి టెండర్ల స్వీకరణ

**నాగులుప్పలపాడు:** చదలవాడ పశుక్షేత్రంలో పశువులకు అవసరమైన వరిగడ్డి అందించడానికి టెండర్లు కోరినట్లు పశు ఉత్పత్తి క్షేత్రం డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. పశుక్షేత్రానికి అవసరమైన 100 మెట్రిక్ టన్నుల వరిగడ్డి ని అందించడానికి మార్చి 3వ తేదీ వరకు వివిధ సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించామన్నారు. వివరాలకు 9392901049 నంబరును సంప్రదించాలని తెలిపారు.

# మంచు తమ్మెర..
# మండుటెండరా..

వేకువజామున పొగమంచు తమ్మెరలు కమ్మేసి చలిగాలులు వీస్తుంటే.. మధ్యాహ్నానికి మండుటెండ చుర్రుమనిపిస్తోంది. శీతాకాలం ముగియకముందే వేసవి వేడి పలకరిస్తోంది. రాత్రివేళ ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒంగోలు నగరంలో సోమవారం ఉదయం పొగమంచు కమ్మేసి వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి రాగా.. మధ్యాహ్నానికి ఎండ వేడి తాళలేక జనం గొడుగులు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది.

- సాక్షి, ఒంగోలు



నగరంలో వేకువజామున కమ్మేసిన పొగమంచు



చలికి వణుకుతూ..





అబ్బా..ఎండ ఎక్కువగా ఉంది..





ఆకులు, బూజుపై మెరిసిపోతున్న మంచు బిందువులు



ఎండ వేడికి తాళలేక గొడుగులు వేసుకుని వెళ్తున్న విద్యార్థినులు

## క్లుప్తంగా

### అద్దె చెల్లించలేదని సచివాలయానికి తాళం

● సిబ్బంది హామీతో తెరుచుకున్న వైనం



రోడ్డుపై ఉన్న సచివాలయ సిబ్బంది

మార్కాపురం: మండలంలోని పెద్ద నాగుల వరం గ్రామ సచివాలయానికి అద్దె చెల్లించ లేదని యజమాని బ్రహ్మయ్య సోమవారం తాళం వేశాడు. దీంతో సిబ్బంది కొంత సేపు బయటే వేచి ఉన్నారు. త్వరలోనే అద్దె చెల్లిస్తామని నచ్చజెప్పడంతో ఆయన తాళం తీశారు. ఐదు నెలలుగా సుమారు 13 వేల రూపాయల అద్దె చెల్లించకపోవడంతో బ్రహ్మయ్య తన ఇంట్లో ఉన్న సచివాలయానికి తాళం వేశారు. పంచాయతీ సెక్రటరీ ఎ.శ్రీనివాసులు అద్దె చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో తాళాలు తీసి ఉద్యోగులను అనుమతించారు.

### రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం



పొగాకు బ్యారన్‌లో మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పొన్నలూరు: మండలంలోని వెంకుపాలెం గ్రామంలో మాదాల ప్రసాద్, బత్తిన కొండయ్య, పర్వతనేని రవికుమార్, పర్వతనేని వెంకట్రావుకు చెందిన రెండు పొగాకు బ్యారన్లు సోమవారం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. పొగాకు క్యూరింగ్ చేస్తుండగా అల్లిక కర్ర జారి మొద్దుగొట్టంపై పడటంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తెచ్చారు. బ్యారన్ లోపలి భాగం పూర్తిగా కాలిపోవడంతో రూ.8 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత రైతులు వాపోయారు.

### నేటి నుంచి జ్ఞానజ్యోతి శిక్షణ

ఒంగోలు సిటీ: జిల్లా వ్యాప్తంగా 38 మండలాల్లో 76 కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి 120 రోజుల పాటు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించనున్నట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సమన్వయంతో ఆరు రోజుల పాటు రెండు విడతలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. డీఆర్పీల ఆధ్వర్యంలో శిక్షణ జరుగుతుందని, సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు కోర్సు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. శిక్షణను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### వెలిగొండకు రూ.2 వేల కోట్లు ఇవ్వాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): పశ్చిమ ప్రాంత ప్రజల వర ప్రదాయిని పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు తక్షణమే రూ.2 వేల కోట్లు నిధులు విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం కనిగిరి ఆర్డీఓ కార్యాలయం ముందు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ యాసీన్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి పీసీపల్లి మండలాన్ని చేర్చాలని, కనిగిరి ప్రాంతంలోని రిజర్వాయర్లను అనుసంధానించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ఆర్ ఆర్ ప్యాకేజ్ అందించాలన్నారు. త్వరలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి కరువు ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కేశవర్ధనరెడ్డికి వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు జీపీ రామారావు, గుజ్జుల బాలిరెడ్డి, ఖాశిం పీరా, పందిటి మోహన్, మౌలాలి, పూర్ణచంద్రరావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

**ప్రమాదాలకు నిలయంగా అనంతపురం-విజయవాడ హైవే**

● మార్కాపురం డివిజన్‌లో 15 బ్లాక్ స్పాట్లు
● గిద్దలూరు-త్రిపురాంతకం మధ్య మూడేళ్లలో 354 రోడ్డు ప్రమాదాలు
● మృతులు 334 మంది, క్షతగాత్రులు 685 మంది..
● సర్వీస్ రోడ్లు సక్రమంగా లేకపోవడం, నిబంధనలు అతిక్రమించడమే కారణం



# జాతీయ రహదారి c/o యమపురి

మార్కాపురం:

జాతీయ రహదారిపై ప్రయాణం సాఫీగా సాగిపోతుందని ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలు గాల్లో కలిసినట్టే! పశ్చిమ ప్రకాశంలో పలు రహదారులు, మూలమలుపులు ప్రయాణికుల ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. అనంతపురం-విజయవాడ నేషనల్ హైవేపై తరచూ సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలు వందలాది కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. నేషనల్ హైవే వెంట ఉన్న గ్రామాల వద్ద క్రాస్‌రోడ్లు, మూల మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, వాహనదారుల అజాగ్రత్త కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. క్షతగాత్రులై చావు అంచుల వరకు వెళ్లి వచ్చినవారు మృతులకు రెట్టింపు సంఖ్యలో ఉన్నారు. అనంతపురం-విజయవాడ నేషనల్ హైవే పశ్చిమ ప్రకాశంలో గిద్దలూరు సమీపం నుంచి మొదలై త్రిపురాంతకం వరకు విస్తరించి ఉంది.


ఈ హైవే రోడ్డులో 2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు మొత్తం 354 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా 331 మంది మృత్యువాతపడ్డారు. ఆయా ప్రమాదాల్లో 685 మంది క్షతగాత్రులయ్యారు.

**తరచూ ప్రమాదాలు**

మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. అత్యధికంగా గిద్దలూరు-దిగువమెట్ట, గిద్దలూరు-బేస్తవారపేట, మార్కాపురం-కంభం, మార్కాపురం-దేవరాజుగట్టు, దేవరాజుగట్టు-కుంట, కుంట నుంచి త్రిపురాంతకం మధ్య ఉన్న నేషనల్ హైవేపై సర్వీసు రోడ్లు సరిగా లేకపోవడంతో టూ వీలర్స్‌పై వచ్చేవారు రోడ్డెక్కే సమయంలో తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా గిద్దలూరు నుంచి త్రిపురాంతకం మధ్య హైవేపై ప్రతి వారం ఒక మేజర్ రోడ్డు యాక్సిడెంట్ చోటుచేసుకుంటోంది.

**డివిజన్‌లో 15 బ్లాక్ స్పాట్స్**

మార్కాపురం డివిజన్‌లో మొత్తం 15 బ్లాక్ స్పాట్స్‌ను అధికారులు గుర్తించారు. ఇందులో మార్కాపురం మండలం కుంట, పెద్దారవీడు మండలం కుంట, గొబ్బూరు, త్రిపురాంతకం, దరిమడుగు వై జంక్షన్, తిప్పాయపాలెం, జంగంగుంట్ల, బేస్తవారపేట క్రాస్‌రోడ్స్, గిద్దలూరు, తర్లుపాడు-తాడివారిపల్లి హైవే ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్లను పోలీసులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నా ఆశించిన ఫలితం లేకపోవడం ఆందోళన కలిగించే అంశం.






మార్కాపురం మండలం కుంట వద్ద ప్రమాదకరమైన మూడు రోడ్ల కూడలి



కూలీల కోసం ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సు

**తప్పనిసరై ఆటోల్లో వెళ్తున్నాం**

కుటుంబ పోషణ కోసం మిర్చి, పత్తి, పొగాకు కోతలకు వెళ్తున్నాం. ఆటోల్లో వెళ్తే నేరుగా పొలం వద్ద దిగుతాం. ప్రమాదమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది. అధికారులు చెప్పినట్టుగా ఇక నుంచి ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్తాం.

– వెంకటలక్ష్మమ్మ, కొట్టాలపల్లి గ్రామం

**కూలీలకు ఆర్టీసీ బస్సులు**



మిర్చి, పత్తి, పొగాకు కోతలకు వెళ్లే కూలీల కోసం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశాం. అయితే చాలా మంది ఆటోలకు అలవాటుపడి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం. సోమవారం రోజు కూడా దోర్నాల, కుంట రూట్లలో 4 బస్సులను కూలీల కోసం ఏర్పాటు చేశాం.

– నరసింహులు, ఆర్టీసీ డీఎం, మార్కాపురం

**71,582 చలానాలు విధింపు**



మార్కాపురం డివిజన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నాం. గతేడాది డిసెంబర్ వరకు 71,582 చలానాలు వేసి రూ.75,11,380 జరిమానా విధించాం. ప్రయాణ సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.

– యు.నాగరాజు, డీఎస్పీ, మార్కాపురం

**ఓవర్ లోడ్‌పై కేసులు నమోదు**



మార్కాపురం డివిజన్‌లో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై ఇటీవల 59 కేసులు నమోదు చేసి సుమారు రూ.15 లక్షల జరిమానా విధించాం. లిక్కర్ సేవించి వాహనాలు నడపడం, ఓవర్ టేక్ చేసే సమయంలోనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

– అమర్‌నాయక్, ఆర్టీఓ, మార్కాపురం

---

## బెంగళూరులో కేసు నమోదైందంటూ మోసం

● ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు

ఒంగోలు టౌన్: మీ మీద బెంగళూరులో కేసు నమోదైందని, అరెస్టు చేయకుండా బెయిల్ ఇవ్వాలంటే డబ్బు చెల్లించాలంటూ సీబీఐ పోలీసు అధికారులుగా నటిస్తూ వీడియో కాల్ చేశారని కనిగిరికి చెందిన ఒక బాధితుడు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. తమ వద్ద నుంచి భారీగా డబ్బులు కూడా వసూలు చేశారని తెలిపారు. వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు తమను భయభ్రాంతులకు గురిచేశారని, తమ అకౌంటు నుంచి ఆర్టీజీఎస్, ఫోన్ పే ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారని చెప్పారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలిసి బాధితుడు గోడు వెళ్లబోసుకున్నాడు. సైబర్ నేరగాళ్లను కఠినంగా శిక్షించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. అదేవిధంగా రైల్వేలో ఉద్యోగం పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చి ఒంగోలుకు చెందిన వ్యక్తి తమ వద్ద నుంచి డబ్బు వసూలు చేశాడని పల్నాడు జిల్లాకు చెందిన మరో బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. తీరా



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

చూస్తే.. నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చినట్లు తెలుసుకుని నిలదీయగా జవాబు ఇవ్వడంలేదన్నారు. తమ వద్ద నుంచి వసూలు చేసిన డబ్బు తిరిగివ్వమని అడుగుతుంటే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 81 మంది బాధితులు ఎస్పీని కలిసి వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు.

**డిజిటల్ అరెస్టుల పేరుతో ఫోన్ వస్తే పోలీసులకు తెలియజేయాలి...**

సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ దామోదర్ అన్నారు. మీ మీద కేసు నమోదైందని, డిజిటల్ అరెస్టు చేయకుండా ఉండాలంటే డబ్బు చెల్లించమని ఎవరికైనా ఫోన్లు వస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డిజిటల్ అరెస్టుల గురించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి భయాందోళనకు గురవకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. సీబీఐ, ఈడీ, కస్టమ్, ఏసీబీ అధికారుల మాదిరిగా నటిస్తూ వీడియో కాల్ చేయడంతోపాటు ముందుగా సేకరించిన వివరాలతో భయాందోళనకు గురిచేస్తున్నారని వివరించారు. అచ్చం పోలీసుల మాదిరిగా లోగోలు కనిపించేలా నటిస్తూ ప్రశ్నలు సంధిస్తారని, లక్షలు కాజేస్తున్నారని తెలిపారు. ఎన్ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఎప్పుడూ లోకల్ పోలీసులను సంప్రదించకుండా ఎవరినీ అరెస్టులు చేయవని, కొత్త వ్యక్తుల నుంచి అనుమానాస్పద ఫోన్లను లిఫ్టు చేయకపోవడమే మంచిదని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే 1930 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై షేక్ రజియా సుల్తానా, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

ఒంగోలు టౌన్: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన జాతీయ రహదారిపై స్థానిక త్రోవగుంట సమీపంలో చోటుచేసుకుంది. ఒంగోలు తాలూకా పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని త్రోవగుంట వద్ద జాతీయ రహదారి పక్కనున్న ఒక షోరూం ఎదురుగా ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం పడి ఉన్నట్లు తాలూకా పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతని కాలు విరిగి, తలకు తీవ్ర గాయాలై ఉన్నాయి. మృతుడి వయసు సుమారు 25 సంవత్సరాలు ఉంటుంది. 5.5 అడుగుల ఎత్తు ఉన్నాడు. నీలిరంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఏదైనా వాహనం ఢీకొనడం వలన చనిపోయి ఉండవచ్చని, వాహనం ఆగకుండా వెళ్లిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వేగంగా వెళుతున్న వాహనం నుంచి కిందకు పడిపోయి కూడా ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య చేసిన



రోడ్డు పక్కన పడి ఉన్న యువకుడి మృతదేహం

తర్వాత ఇక్కడకు తెచ్చి పడేసి ఉండవచ్చని కూడా ప్రచారం జరుగుతోంది. మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. మృతుడి సమాచారం తెలిసిన వారు 9121102127, 9121104779 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఒంగోలు తాలూకా సీఐ అజయ్ కుమార్ తెలిపారు.

## బఫర్ గోడౌన్‌ను తనిఖీ చేసిన జేసీ

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రామంలో ఓం శ్రీ భావనాసాయి వేర్హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ బఫర్ గోడౌన్‌ను జేసీ గోపాలకృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో ఉన్న స్టాక్ వివరాలను పరిశీలించారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించి అనుసంధానం చేయబడిన మిల్లులకు రవాణా చేయబడి క్లస్టర్ మిల్లింగ్ ద్వారా మిల్లింగ్ చేయబడిన ఫోర్టిఫైడ్ రైస్ నిల్వ చేయడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని గోడౌన్ సిబ్బందికి సూచించారు. ఇతర జిల్లాల నుంచి రవాణా చేయబడి బఫర్ గోడౌన్లో నిల్వ చేయబడి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మార్చి 2025 అలాట్మెంట్‌కు సిద్ధంగా ఉన్న బియ్యం వివరాలను పరిశీలించారు. ఈ బియ్యాన్ని జిల్లాలోని 10 మండల స్టాక్ పాయింట్లకు రవాణా చేయడానికి కావాల్సిన హమాలీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎగుమతి, దిగుమతి కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టాక్ వివరాలను గోడౌన్ల వారీగా తెలుపుతూ బోర్డు ఏర్పాటు చేయాలని చెప్పారు. బియ్యం గోతాల



బఫర్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

నుంచి కారిపోయిన బియ్యాన్ని కూడా సేకరించి శుభ్రపరిచి గోదాంలో భద్రపరచాలని సిబ్బందికి సూచించారు. ముందుగా కొలచనకోట గ్రామంలో జరుగుతున్న రీ సర్వేని జేసీ పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. రీ సర్వే జరుగుతున్న క్రమంలో ప్రతి రైతుకూ నోటీసులిస్తున్నారా.. లేదా..? అనే అంశాలను పరిశీలించి సర్వే అసిస్టెంట్లకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైతుకూ నోటీసులు అందించి వారి ఎదుటే సర్వే చేయాలని ఆదేశించారు. జేసీ వెంట ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, మద్దిపాడు తహసీల్దార్ సుజన్‌కుమార్, జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

### పేకాట శిబిరాలపై ఆకస్మిక దాడి

● రూ.40,500 స్వాధీనం

చీమకుర్తి రూరల్: మండలంలోని మంచికలపాడు పరిసర ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై సోమవారం పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. సీఐ సుబ్బారావు నేతృత్వంలో సిబ్బంది దాడి చేసి ఆరుగురు జూదరులను పట్టుకున్నారు. వారి దగ్గర ఉన్న రూ.40,500 నగదు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## ద్విచక్రవాహనం గుంతలో పడి యువకుడు మృతి

సింగరాయకొండ: రోడ్డుపై ఉన్న గుంతలో పడి వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురై ద్విచక్ర వాహనదారుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పాకల రోడ్డులో మర్రిచెరువు సమీపంలో జరిగింది. స్థానిక జీవీఆర్ ఆక్వా కంపెనీలో పనిచేస్తున్న వాయిల రాము (30) ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో పాకల క్రాంతినగర్‌లోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తిరిగి సింగరాయకొండ వస్తున్నారు. ఆ సమయంలో రోడ్డుపై ఉన్న గుంతలో వాహనం పడి అదుపు



వాయిల రాము (ఫైల్)

తప్పింది. ఈ ప్రమాదంలో తలకు గాయాలై అక్కడికక్కడే అతను మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి.మహేంద్ర వివరించారు. రాము దహన సంస్కారాలను కంపెనీ నిర్వహిస్తుందని, వారి కుటుంబానికి అండగా ఉంటుందని జీవీఆర్ కంపెనీ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. రాముకు వివాహం కాగా, ఇద్దరు పిల్లలున్నారు.

## అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

● సమ్మె కాలంలో ఇచ్చిన మినిట్స్ కాపీలకు జీవోలివ్వాలి
● అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ డిమాండ్

ఒంగోలు సిటీ: అంగన్‌వాడీ వర్కర్లకు గతంలో సమ్మె కాలంలో ఇచ్చిన మినిట్స్ కాపీలకు జీవోలివ్వాలని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.కల్పన డిమాండ్ చేశారు. సోమవారం ఒంగోలు ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ఉపాధ్యక్షురాలు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని గతంలో 42 రోజుల పాటు సమ్మె సందర్భంగా ఇచ్చిన మినిట్స్ కాపీలను జీవో రూపంలో ఇవ్వాలన్నారు. ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్స్ అతి తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. 2019లో అంగన్‌వాడీ వర్కర్లకు ఆనాటి ధరలకు అనుగుణంగా వేతనం పెంచారన్నారు. నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా కార్మికులకు వేతనాలు పెంచడంలో ప్రభుత్వాలు మీనవేషాలు లెక్కిస్తున్నాయని విమర్శించారు. అంగన్‌వాడీలకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్‌గా మార్పు చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న డీఏ బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. అన్ని యాప్‌లు రద్దు చేసి ఒకే యాప్‌గా మార్పు చేయాలని, కేంద్రాలకు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని కోరారు.



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సమస్యలు పరిష్కరించకుంటే కార్మిక సంఘాలతో కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు స్వామిరెడ్డి, యూనియన్ ఒంగోలు నగర ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, కె.ఎమియా, నాయకులు కే.వి.సుబ్బమ్మ, నిర్మల, పద్మ, శేషమ్మ, సంధ్య, జ్యోతి, రాజేశ్వరి, శోభ, శ్రీదేవి, గౌసియా, కవిత తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

● ఎస్పీ ఏఆర్ దామోదర్



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: మహిళలు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేసే వాతావరణం పోలీసు స్టేషన్లలో ఉండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. మహిళలతో గౌరవంగా మాట్లాడినపుడే వారు తమ సమస్యలను ధైర్యంగా చెప్పడానికి అవకాశం ఉంటుందన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మహిళా ఎస్ఐలు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. మహిళల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, సత్వర పరిష్కారంపై పలు సూచనలిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ ఉమెన్ హెల్ప్ డెస్క్ వద్ద ఒక హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. మహిళల సమస్యలు సావధానంగా విని వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని చెప్పారు. మహిళలపై నేరాలను అత్యంత ప్రాధాన్యత కలిగిన కేసులుగా పరిగణించాలని, తగిన సాక్ష్యాలు సేకరించి న్యాయం చేసేందుకు కృషి చేయాలన్నారు. సఖి వన్ స్టాప్ సెంటర్లను మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీసీఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, టౌన్ మహిళా ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, అనిత, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.